
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com



గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3 । కనిష్ఠం 27.5

5

కామారెడ్డి
జిల్లా వార్తలు

శుక్రవారం 5 ఏప్రిల్ 2024






కామారెడ్డిలో ఏర్పాటు చేసిన వెంచర్

# రియల్ ఢమాల్



- వ్యాపారం సాగక ఆందోళన చెందుతున్న జిల్లా వ్యాపారులు
- రియల్ రంగంలో పెట్టుబడులు పెట్టి ఇరుక్కుపోయి విలవిల్లాడుతున్న రియల్టర్లు
- అప్పుల ఊబిలోకి రియల్ వ్యాపారులు
- దందా నడవలేక ఇబ్బందుల్లో మధ్యవర్తులు
- ధరలు పెరగడంతో సామాన్యులు ప్లాట్లు కొనలేని పరిస్థితి
- పడిపోయిన రిజిస్ట్రేషన్‌లు, తగ్గిన సర్కార్ ఆదాయం

కామారెడ్డి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటే మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగి శ్రీమంతులుగా ఎదిగిన వారు జిల్లాలో ఎందరో ఉన్నారు. తక్కువ సమయంలో కోట్ల రూపాయలు కూడా కూడబెట్టారు. ఇది గత సంవత్సరం కింద వరకు ఉన్న పరిస్థితి. జిల్లాలో గత ఏడాది నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. అప్పులు తెచ్చి మరి రియల్ వ్యాపారంలో దందా సాగించిన వ్యాపారులు, మధ్యవర్తులు అప్పుల ఊబిలోకి వెళ్లి తలలు పట్టుకుంటున్నారు. గత ఏడాది నుంచే కాకుండా కొ ంతో నా సమయం నుంచి రియల్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడింది. త్వరలో కొంతమేర రియల్ వ్యాపారం ముందుకు సాగినా అంతంత మాత్రంగానే ఉండేది. ప్లాట్ల ధరలు అడ్డగోలుగా పెరగడంతో సామాన్యులు ఇంటి స్థలం కొనలేని పరిస్థితి ఉంది. దీంతో కొనుగోలు, అమ్మకాలు జరగక వ్యాపారులతో పాటు మధ్యవర్తులు ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్‌లు తగ్గిపోవడంతో ప్రభుత్వ ఆదాయం సైతం పడిపోతోంది.

## భూముల ధరలు పెరగడమే కారణం

జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో, పలు మండల కేంద్రాల్లోనూ భూముల ధరలు అడ్డగోలుగా పెరిగాయి. కామారెడ్డి పట్టణం గత ఐదేళ్ల నుంచి విస్తరిస్తుండడంతో ప్లాట్ల ధరలు అమాంతంగా పెరిగాయి. మూడేళ్ల కిందట రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు వెంచర్లు.. ఆరు ప్లాట్లు అన్నట్లుగా జోరుగా సాగింది. అయితే గత ఏడాది నుంచి వ్యాపారం ఒక్కసారిగా కుప్పకూలింది. కొనుగోలు, అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పూర్వ వైభవం మాత్రం రావడం లేదు. భూములు, ఇంటి స్థలాల ధరలు అడ్డగోలుగా పెరగడంతో ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా కామారెడ్డి పట్టణ శివారుల్లోని దేవునిపల్లి, లింగాపూర్, టెక్రియాల్, అడ్లూర్, పాత రాజంపేట, రామేశ్వర్‌పల్లి, ఇల్చిపూర్ తదితర ప్రాంతాల్లో ప్లాట్ల క్రయవిక్రయాలు తగ్గిపోయాయి. అదేవిధంగా బాన్సువాడ, ఎల్లారెడ్డి, భిక్కనూర్, సదాశివనగర్, గాంధారి తదితర ప్రాంతాల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చాలా మట్టుకు తగ్గింది. దీనికి ప్రధాన కారణం భూముల ధరలు పెరగడమేనని వ్యాపారులు చెబుతున్నారు.

## ఎకరం భూమి కోట్లలో.. గజం రూ.10వేలకు పైనే

కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు శివారు ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి ఎదురవుతోంది. కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోనూ ఎకరం భూమి కోట్లలో పలుకుతుండగా గజం స్థలం రూ.10వేలకు పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. పట్టణ కేంద్రంలో పలు కాలనీల్లో గజం భూమి రూ.50వేల నుంచి రూ.20వేల వరకు ధర పలుకుతోంది. వంద గజాల ప్లాట్ కొనాలంటే రూ.50 నుంచి 20లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. పట్టణానికి దూరంగా ఉన్న వెంచర్‌లో ఇదే పరిస్థితి గజానికి తక్కువ తక్కువలో రూ.10వేల వరకు పలుకుతోంది. ఇంత పెద్ద మొత్తంలో వెచ్చించి సామాన్యులు ప్లాట్లు కొనలేని పరిస్థితి లేదు. దీంతో చాలా మంది సొంత స్థలం కొనేందుకు మొగ్గు చూపడం లేదు. మరో వైపు రియల్ వ్యాపారం పడిపోవడంతో మధ్యవర్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన భూముల ధరలు తగ్గే అవకాశం లేకపోవడం, ప్రస్తుతం ఉన్న ధరలతో అమ్మకాలు సాగకపోవడంతో వ్యాపారులతో పాటు మధ్యవర్తులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

## పెట్టుబడులు పెట్టి ఇరుక్కుపోయిన వ్యాపారులు


గత మూడేళ్ల కిందట రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగడంతో వ్యాపారులు కోట్లు గడించారు. దీంతో చాలా మంది రియల్ వ్యాపారంలోకి దిగారు. ఫైనాన్స్ నుంచి డబ్బులు తెచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టారు. అయితే గత సంవత్సరం కాలం నుంచి రియల్ వ్యాపారం పడిపోవడం, ఇదే సమయంలో ఎన్నికలు రావడంతో రియల్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ఫైనాన్స్‌లో డబ్బులు తెచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి ఇరుక్కుపోయారు. పైకి చెప్పుకోలేక హుందాతనాన్ని కొనసాగిస్తున్న వ్యాపారులు ఎందరో ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోకపోవడంతో రోజురోజుకూ వ్యాపారం సాగక పెట్టిన పెట్టుబడులు రాక తలలు పట్టుకుంటున్నారు. రోజురోజుకు అప్పుల్లో ఇరుక్కుపోతున్నారు. చాలా మందే ఫైనాన్స్ వ్యాపారులు రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగక దివాల తీసిన వారు సైతం ఉన్నారు.

## తగ్గిన రిజిస్ట్రేషన్లు

రియల్ వ్యాపారం కుదేళ్లవుతుండడంతో రిజిస్ట్రేషన్‌లు సైతం తగ్గుతుండడం, ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం చూపుతోంది. కామారెడ్డి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గతంలో రోజుకు 40 నుంచి 50 వరకు డాక్యుమెంట్‌లు రిజిస్ట్రేషన్ అయ్యేవి. రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా నెలకు 35 నుంచి రూ.50లక్షల వరకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. అయితే కరోనా కారణంగా తగ్గుతూ వచ్చిన రిజిస్ట్రేషన్‌లు ఇప్పటికీ పుంజుకోవడంలేదు. రెండు, మూడేళ్లుగా రిజిస్ట్రేషన్‌లు ఘననీయంగా తగ్గిపోయాయి. రిజిస్ట్రేషన్‌ల ద్వారా ప్రభుత్వానికి గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరంలో ఆదాయం తగ్గిందని ఆ శాఖాధికారులు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్‌ల కోసం గతంలో కార్యాలయం వద్ద బారులు తీరేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేకుండా పోయాయి.

# ఆకాశం వైపు.. అన్నదాత చూపు!

- వడగళ్ల వానతో పంటను నష్టపోయిన రైతులు
- ఎండుతున్న వరి పంట
- పంటలు ఎండిపోవడంతో రైతుల్లో ఆందోళన
- పంట రైతుల చేతికందేది కష్టమే





దోమకొండలో ఎండిన వరి పంటను చూపుతున్న రైతులు

దోమకొండ, ఏప్రిల్ 4: యాసంగి పంటలు చేతికందుతాయో లేదోనని రైతులు తీవ్ర ఇందోళనలో ఉన్నారు. గత పదిహేను రోజుల క్రితం వడగళ్ల వర్షం, గాలులు వీచడంతో పొట్ట దశలో ఉన్న వరి పంట, మొక్కజొన్న పంటలను కొంత మంది రైతులు పూర్తిగా నష్టపోయారు. యాసంగి పంటలు వేసినప్పటి నుంచి మోగి పురుగు రోగం, జాజురోగం, తిర రోగాలు సోకడంతో అప్పులు చేసి రైతులు అధిక పెట్టుబడులు పెట్టారు. పంటలు చేతికవచ్చే సమయంలో భూగర్భ జలాలు అడగంటి పోయాయి. దీంతో రైతులు నాటిన దాంట్లో నుంచి కొంత వరకు వదిలిపెట్టి సగాన్ని మాత్రమే పారిస్తున్నారు.

## పెట్టుబడి కోసం నానా తంటాలు పడుతున్న రైతులు

ఒక పక్క భూగర్భ జాలాలు అడుగంటి పోవడం, అకాల వర్షంతో నష్టపోయిన రైతులు ఉన్న దాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. వరి పంటకు నీరందక చాలా మంది రైతులు వేసిన దాంట్లో సగం కంటే ఎక్కువే వదిలిపెట్టి పశువుల మేతకు వాడారు. మిగతా పంట కాపాడుకునేందుకు ఉదయం నుంచే రాత్రి వరకు రైతులు పంట చేనులోనే పైపులు పరుస్తూ నీరు పారిస్తున్నారు. అయినా కూడా పంటకు నీరందడం లేదు. చేతికి వచ్చిన వరి పంటకు ఒక వర్షం పడితే బాగుండని వర్షం కురియలని రైతులు కనపడిన రాయిని మొక్కుతున్నారు.

## 24 గంటల్లో తడిసేది గుంట మాత్రమే

రాత్రనక, పగలనక రైతులు కష్టపడుతూ నీరు పారిస్తున్న భూగర్భ జాలాలు అడుగంటిపోవడంతో 24 గంటల పాటు మడిలో వేస్తే గుంట మాత్రమే తడుస్తోంది. బీటాలు వారిన భూమిలో బోరుబావుల నుంచి వచ్చే నీరు బీటల్లోకి వెళ్లిపోతోంది.

## మండలంలో ఎత్తేసిన బోరు బావులు..

దోమకొండ, బీబీపేట మండలాల్లో కొంత మంది రైతులకు చెందిన బోరుబావులు ఎత్తేశాయి. బోరుబావుల నుంచి నీరు రాక పోవడంతో చాలా మంది రైతులు పంటలపై ఆశలు వదులుకున్నారు.

## అప్పులతో అయోమయం

యాసంగి పంట సాగు చేసేందుకు చాలా మంది రైతులు అప్పులు చేశారు. పురుగు మందులు, కేజీ వీల్స్, బీస్ బీస్, యూరియా, ఇతర మందులు పిచికారీ చేసి పంటలను కంటికి రెప్పలా కాపాడుకున్న పొట్టదశకు రాగానే బోరు బావులు ఎత్తేయడంతో పంట కళ్ల ముందే ఎండిపోతుండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫర్టిలైజర్ దుకాణంలో ఉద్దెర మందులను తీసుకువచ్చిన రైతులు 90 శాతంకు పైగా ఉన్నారు. పంట చేతికి రాకపోవడం లేదనే బెంగతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పంటకు చేసిన అప్పులు ఎలా తీర్చాలని, కుటుంబాన్ని ఎలా బతికించుకోవాలని రైతులు కంటిమీద కునుకు లేకుండా బతుకును వెళ్లదీస్తున్నారు.

## ఎవరిని అడిగినా అదే గోస

దోమకొండ, బీబీపేట మండలాల్లోని పలు గ్రామాల్లో ఏ రైతును అడిగినా తన బాధలు అంతా ఇంత కాదు. చేతిలో చిల్లిగవ్వ లేక, పంటలు చేతికి వస్తాయనే ఆశలు లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రైతులను ఎవ్వరిని టచ్ చేసినా వారి బాధలు వర్ణానాతీతం.

### మూడున్నర ఎకరాలు ఎండిపోయింది

● నేతుల శ్రీనివాస్, రైతు, దోమకొండ

దోమకొండ గ్రామ శివారులో 5 ఎకరాలు వరి నాట్లు వేసినా. అందులో మూడున్నర ఎకరాల వరి పంట నీరందక ఎండిపోయింది. మిగతా పంట కూడా చేతికి వస్తదనే ఆశ లేదు. ఎండలు ఎక్కువగా కొడుతున్నాయి. దీంతో రోజురోజుకూ బోరుబావుల నుంచి నీరు తగ్గుతోంది. పంట పూర్తయ్యే వరకు బోరు నుంచి నీరు వస్తుందో లేదో అని భయంగా ఉంది. ఎండిపోయిన పంటలను సర్వే చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

### కళ్ల ముందే ఎండిపోవడంతో తట్టుకోలేకపోతున్నాం

● జోగిని మల్లయ్య, రైతు, సంగమేశ్వర్

ఎండిన పంటలను ప్రభుత్వం అధికారులతో సర్వే చేయించి రైతులను ఆదుకోవాలి. భూగర్భ జాలాలు అడుగంటిపోవడంతో రైతులు పూర్తిగా పెట్టుబడులు నష్టపోయాం. నాటు వేసినప్పటి నుంచి ఈ యేడు ఎక్కువ పెట్టుబడులు అయ్యాయి. అన్నీ భరించి ఇప్పటిదాక పంటను కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చాం. ప్రస్తుతం పంటకు నీరు పారక కళ్ల ముందే పంట ఎండిపోవడంతో తట్టుకోలేకపోతున్నాం.

# తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దు

## ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్



అధికారుల సమావేశం మాట్లాడుతున్న శరత్

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 4: తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు రానియొద్దని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఏ.శరత్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం తాగునీటి ఎద్దడి నివారణపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మండల స్థాయిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను ఎప్ప టికప్పుడు సత్వరమే పరిష్కారం చేయాలని సూచించారు. ప్రతీ మండలానికి జిల్లా స్థాయి అధికారులను స్పెషల్ అధికారులుగా నియమించాలని తెలిపారు. మండల స్థాయి అధికారులను క్లస్టర్ అధికారులుగా నియమించి వారం రోజులకోసారి తాగు నీటి ఎద్దడిపై సమీక్ష నిర్వహిలని తెలిపారు. జిల్లాలో 842 ఆవాస ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. అన్ని ఆవాస ప్రాంతాలకు తాగునీరు అందేవిధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు. నీటి ఎద్దడి నివారణపై తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామ శివారులోని మల్లన్న గుట్ట సమీపంలో ఉన్న మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. తాగునీటికి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ సుజాత, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య

- కాలనీల్లోకి లోడ్ లారీల రాక
- గంటల తరబడి రోడ్డుపైనే వాహనాలు
- పట్టించుకోని అధికారులు

పాత బాన్సువాడ రహదారిలో ట్రాఫిక్ జాం అయిన దృశ్యం



బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 4: బాన్సువాడ మున్సిపాలిటీగా మారిన తర్వాత జనం, వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయి. ప్రతీరోజు ఇతర ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం వాహనదారులు బాన్సువాడ పట్టణానికి విచ్చేసి పనులను ముగించుకున్నాక తమ తమ గ్రామాలకు తిరుగు పయనమవుతున్నారు. వాహనాల రాకపోకలు అధికమవడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జఠిలమవుతునే ఉంది. ట్రాఫిక్ నియంత్రణ కోసం సిగ్నల్స్ ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో తాడ్కోల్ రోడ్డు, బస్టాండ్, ఎన్జీవోస్ కాలనీ, పాత బాన్సువాడ రహదారుల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. ఈ మధ్య లోడ్ లారీలు సైతం కాలనీల్లో వస్తుండడంతో ఈ సమస్య మరింత పెరిగింది. పాత బాన్సువాడ రహదారిలో బుధవారం రాత్రి ఓ లోడ్ లారీ వాహనదారులను, ప్రజలను ఇబ్బందుల పాల్జేసింది. లారీ వెళ్లడానికి వీలులేకున్నా డ్రైవర్లు ఇష్టారీతిన నడుపుతున్నారు. దీంతో పాత బాన్సువాడ రోడ్డులో ట్రాఫిక్ జాం ఏర్పడింది. రెండు వైపులా వాహనాలు వెళ్లలేనంతగా సమస్య తలెత్తింది. చేసేదేమి లేక వాహనదారులు వేరే దారుల్లో తమ వాహనాలను తిప్పుకుని వెళ్లిపోయారు. అధికారులు లోడ్ లారీలను పట్టణాల్లో అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# వృత్తి ప్రొఫెసర్.. ప్రవృత్తి 'మత్తు' తయారీ!

● ఇంటర్‌పోల్ పోలీసుల అరెస్ట్‌తో బహిర్గతమైన టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ బాగోతం

● విధులకు గైర్హాజరైనా పట్టించుకోని వర్సిటీ ఉన్నతాధికారులు




డిచ్‌పల్లి, ఏప్రిల్ 4: తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పెద్దొళ్ల శ్రీనివాస్ వృత్తి పరంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌అయినా ఆయన ప్రవృత్తి మారక ద్రవ్యాల తయారీపై పడింది. తెలంగాణ వర్సిటీలోని ఓ అధ్యాపకుడు నిషేధిత మారక ద్రవ్యాల తయారీ కేసులో అరెస్టు కావడం స్థానికంగా కలకలం రేపింది. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన అధ్యాపకుడు డ్రగ్స్ వ్యాపారంలో పోలీసుల అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. అధ్యాపకుడు శ్రీనివాస్ వ్యవహార శైలి వర్సిటీలో తొలి నుంచే వివాదాస్పదంగా ఉండేది. విధులకు సరిగా రాకుండా.. ఏదో తుతూ మంత్రంగా వర్సిటీకి వచ్చేవాడని విద్యార్థి సంఘాలు నాయకులు ఆరోపిస్తున్నారు. వర్సిటీలో పనిచేసే అధ్యాపకులకు ఐదేళ్ల సీనియారిటీ ఉంటే డిప్యూటేషన్‌పై ఇతర సంస్థల్లోకి వెళ్లి పని చేసేందుకు ఆస్కారం ఉంటుంది. కానీ అధ్యాపకుడు శ్రీనివాస్ మాత్రం ఉద్యోగంలో చేరిన నాలుగేళ్లకే గత వీసీని ప్రసన్నం చేసుకొని డిప్యూటేషన్‌పై వెళ్లాడు. అది నుంచి వివాదాస్పదంగా ఉన్న శ్రీనివాస్ హైదరాబాద్ శివారులో మెడికల్ ల్యాబ్‌సంస్థలో మేనేజింగ్ పార్ట్‌నర్‌గా కొనసాగుతున్నాడు. ఇలాంటి నిషేధిత వ్యాపారంలో కొనసాగుతున్న శ్రీనివాస్‌ను వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. యూనివర్సిటీలో ఉద్యోగిగా ఉంటూ నిషేధిత డ్రగ్స్ తయారీ చేస్తూ గత నెల 22న శ్రీనివాస్ అరెస్ట్ అయిన విషయం 4రోజుల క్రితం వర్సిటీ రిజిస్ట్రార్ దృష్టికి రావడంతో శ్రీనివాస్ గత మార్చి వేతనం నిలిపివేశారు. కానీ చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి అరెస్ట్ అయితే 48గంటల్లో సస్పెండ్ చేయాల్సి ఉన్నా శ్రీనివాస్‌పై వర్సిటీ అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. కాగా శ్రీనివాస్‌పై కేసు నమోదు ఎఫ్ఆర్ఐ కాపీ తనకు ఇంతవరకు అందలేదని రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొనడం గమనార్హం.

## ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత

జక్రాన్‌పల్లి, ఏప్రిల్4: మండలంలోని తొర్లికొండ గ్రామంలో కొం డపై నూతనంగా నిర్మించనున్న వెంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. గుగరువారం గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు.

## జాతీయస్థాయి క్రీడాకారిణికి అభినందన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్3: పట్టణంలోని సాంఘీక సంక్షేమ పాఠశాలలో క్రీడాకారిణి సౌజన్యను గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ సవిత అభినందించారు. మార్చి 27నుంచి ఈనెల 1వ తేదీ వరకు జరిగిన అండర్-14 జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని జట్టుకు ప్రథమ స్థానంలో నిలిపి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి సౌజన్యను పాఠశాల పిజికల్ డైరెక్టర్ స్వప్న, పీఈటీ భాగ్యలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏర్గట్లలో చలివేంద్రం ప్రారంభం

ఏర్గట్ల, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని కార్యదర్శి జాకీర్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు, దూర ప్రాంతాలకు వెళ్ళే మహిళలకు, వాహనదారులకు వేసవి దాహార్తి తీర్చేందుకు తాగు నీరు అందుబాటులో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జీపి సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

# మూడేళ్లుగా నిర్మాణంలోనే..

● కొనసా..గుతున్న వెజ్ మరియు నాన్‌వెజ్ మార్కెట్ సమీకృత భవనం పనులు
● రోడ్డుపైనే వ్యాపారుల క్రయవిక్రయాలు ● ప్రారంభానికి నోచుకునేదెన్నడో..?



అసంపూర్తిగా ఉన్న మార్కెట్ భవనం

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 4: 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది భీమ్‌గల్ పట్టణ మున్సిపాలిటీ దుస్థితి. భీమ్‌గల్ పట్టణ అభివృద్ధిలో భాగంగా 7 డిసెంబరు 2021న పట్టణ నడిబొడ్డున ఉన్న పాత రెవెన్యూ శాఖ కార్యాలయ ఆవరణలోని స్థలంలో సుమారు రూ.2కోట్లతో సమీకృత వెజ్ మరియు నాన్‌వెజ్ మార్కెట్ భవననిర్మాణ పనులను బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నిక లకు ముందుగానే భవనం ప్రారంభోత్సవం ఉంటుందని అందరూ భావించారు. భవనం నిర్మాణానికి అవసరమైన నిధులున్నా ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు. సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదన్న ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

● ముచ్చటగా మూడేళ్లు..

భీమ్‌గల్‌పట్టణంలో ఎన్నో ఏళ్లుగా మార్కెట్ యార్డ్ లేక కూరగాయలు, మాంసం, చేపల విక్రయదారులు నడిరోడ్డుపైనే సుమంగళి చౌరస్తా వద్ద, మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో విక్రయాలు కొనసాగిస్తుంటారు. ప్రతీ సోమవారం నిర్వహించే సంత కూడా రోడ్డుపైనే కొనసాగుతోంది. మార్కెట్‌యార్డ్ పూర్తికాకపోవడంతో విక్రయదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్లపైనే అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా విక్రయాలు జరుపుతున్న చిరు వ్యాపారులకు మున్సిపాలిటీ సిబ్బంది వారికి నూతన మార్కెట్ భవనంలో గదుల నెంబర్లను కేటాయించారు. ఇప్పటికీ నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా వంద పడకల ఆసుపత్రి, మార్కెట్‌యార్డ్ భవనాల అవసరాలను అప్పటి ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీ పాలకవర్గం గుర్తించారు. ఎన్నో ఏళ్లుగా మార్కెట్ యార్డ్ లేక భీమ్‌గల్ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పేరుకే మున్సిపాలిటీ.. అభివృద్ధి మాత్రం శూన్యం అన్నట్లు మారింది భీమ్‌గల్ పట్టణ పరిస్థితి. ఇప్పటికైనా కోట్లలో ఆదాయం ఉన్నా భీమ్‌గల్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రజాప్రతినిధుల అలసత్వంతో మూడేళ్ల క్రితం ప్రారంభించిన సమీకృత భవనం పనులు సగం కూడా పూర్తి కాలేదు. నామమాత్రపు గదుల నిర్మాణం చేసి సంబంధిత కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడంలో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా త్వరితగతిన వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం పనులను పూర్తిచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## లక్ష్మి కెనాల్ ఆయకట్టు రైతులకు ఆఖరితడి వరకూ సాగునీరు ఇవ్వాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, ఏప్రిల్ 4: ముప్కాల్ మండలంలోని లక్ష్మి కాలువ ఆయకట్టు కింద ఉన్న పంటను బతికించుకునేందుకు లక్ష్మి కెనాల్ ద్వారా నీటివిడుదల కొనసాగించాలని శ్రీరాం సాగర్‌ప్రాజెక్టు ఎస్ఈ, సీఈలను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం కోరారు. ఈ సందర్భంగా రైతుల వినతి మేరకు రోజుకు 400 క్యూసెక్కుల చొప్పున 10రోజుల పాటు (0.3టీఎంసీ)ల నీటిని చివరి తడికింద విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులతో ఎన్నిసార్లు విన్నవించుకున్నా వినకుండా ప్రభుత్వం నీటి అలకేషన్ లేని ప్రాంతాలను వరదకాలువ ద్వారా నాలుగు టీఎంసీల నీటిని కిందకు విడుదల చేశారు. అలకేషన్ ఉన్న లక్ష్మీకాలువకు, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి లిఫ్టుకు, నవాబ్ లిఫ్టుకు ఆయకట్టులోని రైతులు సాగునీరు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తోంది.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4: యువత మత్తు పదార్థాలను వీడి స్వామి వివేకానంద సూచించిన మార్గంలో నడవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రధాన వక్త నర్ర వెంకట శివకుమార్ అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ యువత అనుకున్న లక్ష్యాలు చేరాలంటే చెడుమార్గాలకు లోనుకావద్దన్నారు. జాతీయవాద స్ఫూర్తితో ప్రతీఒక్కరు ముందుకు సాగలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ అంటే క్రమశిక్షణతో కూడుకున్నదని, అన్నారు. విద్యార్థులు సమయపాలనతో మెలిగి ఎన్నో విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ గుప్తా, ఖండకార్యవహభూషన్ జిల్లా సహవ్యవస్థాపక ముఖ్ గంగారెడ్డి, సాయికుమార్, శ్రవణ్, చందు, సంతోశ్ పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మానాల మోహన్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఏర్గట్ల, ఏప్రిల్4: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ మైనార్టీ సోదారులు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు ఆడెపు గంగాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ పెద్దిరెడ్డి రవి, రొక్కిడ సంజీవ్, మునీరోద్దీన్, యూసుఫ్, మైనార్టీలు పాల్గొన్నారు.

● మోర్తాడ్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న సునీల్‌కుమార్



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మోర్తాడ్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రంజాన్‌ను పురస్కరించుకొని ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ రంజాన్ పండుగ ముస్లింలకు అతిపెద్దపండగా విశిష్టతను ఆయన వివరించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గడ్డం అశోక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గిర్మాజీగోపి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, అశోక్, కపిల్, గిర్మాజీ గంగాధర్, ముస్లిం మజీద్ కమిటీ పెద్ద మనుషులు, ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

డిచ్‌పల్లి, ఏప్రిల్4: 44వ జాతీయ రహదారి పక్కన అనాథశవం పడి దుర్వాసనగా రావడంతో డిచ్‌పల్లి పోలీసులు ఆ శవాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని నడిపల్లి గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్‌కు డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ సమాచారం అందజేశారు. స్పందించిన పంచాయతీ సిబ్బంది రాము, సంతోశ్, శాంసన్, బాబా, నర్సయ్య, రాజేశ్, దుర్గవ్వ కలిసి అనాథశవాన్ని ట్రాక్టర్‌లో స్మశాన వాటికకు తీసుకెళ్లి జేసీబీతో పూడ్చివేయించారు.

## ఇసుక పాలసీపై అధికారులకు అవగాహన

జక్రాన్‌పల్లి, ఏప్రిల్4: ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతి కోసం ప్రభుత్వం రూపొందించిన ఇసుక పాలసీపై అధికారులు అవగాహన కల్పించారు. గురువారం జక్రాన్‌పల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం కొత్త పాలసీపై సమావేశం నిర్వహించారు. కొత్త ఇసుక పాలసీపై తహసీల్దార్ కిరణ్మాయి, అధికారులు అవగాహన కల్పించారు. సమావేశంలో ఆర్ఐ ప్రవీణ్, పోలీసులు, పంచాయతీకార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా చూడాలి

డొంకేశ్వర్ ఏప్రిల్4: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీవో కిరణ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని సిర్పూర్, అన్నారం గ్రామాల్లో ఎంపీవో కిరణ్ పర్యటించారు. నీటి ట్యాంకుల చుట్టూ మొరంపోసి చదును చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించి ట్యాంకులను పరిశీలించారు. పంచాయతీ వాటర్ వర్క్, సెవెన్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు మౌనిక, విగ్నేష్, కారోబార్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీవో కిరణ్

## ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు పెంచాలి



ఆసుపత్రిలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 3: ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు పెంచాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో డివిజన్‌స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మాతా శిశు సంరక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీ చేయించుకోవాలని సూచించారు. ఏరియా ఆసుపత్రిలో 24 గంటలు ప్రసూతి సేవలు అందుతాయని వివరించారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సమీక్షలు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయ్యేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి, సీహెచ్‌వో కృష్ణమూర్తి, ఆసుపత్రి వైద్యులు నాగరాజు, స్రవంతి, అపర్ణ, గీత, అధికారులు సాయి ఉన్నారు.

## 7న జక్రాన్‌పల్లి ఆదర్శ పాఠశాలలో ప్రవేశపరీక్ష

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 4: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6, 7, 8, 9, 10 తరగతులలో ప్రవేశానికి ఈనెల 7న పరీక్ష పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి పరీక్ష ఈనెల 7న ఉదయం 10గంటలకు ఉంటుందని, 7, 8, 9, 10తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం మధ్యాహ్నం 2గంటలకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రవేశ పరీక్ష విద్యార్థులు ఆదర్శ పాఠశాలకు గంట ముందు అనుమతించడం జరుగుతుందన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ రిజిష్ట్రార్

మోర్తాడ్, ఏప్రిల్4: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార శాఖ అసిస్టెంట్ రిజిష్ట్రర్ శ్రీనివాస్ అన్నారు. కొనుగోలు కేంద్రాలలోనే తమ ధాన్యాన్ని విక్రయించి లబ్ధిపొందాలని సూచించారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్, పాలెం, ఒడ్యాట్, మోర్తాడ్ గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మానిటరింగ్ అధికారి నర్సింగ్‌రావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని కోరారు. ఏ గ్రేడ్ వరికి రూ.2203, బీ గ్రేడ్ వరికి రూ.2183 రైతులు ప్రభుత్వం అందిస్తున్న ధరలకు విక్రయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కల్లెం అశోక్‌రెడ్డి, కార్యదర్శి కాశీరాం, రైతులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ గిరిజన మోర్చా పార్లమెంట్ జిల్లా కన్వీనర్‌గా గంగాధర్

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్4: బీజేపీ గిరిజన మోర్చా పార్లమెంట్ నిజామాబాద్ కన్వీనర్‌గా కొర్ర గంగాధర్‌ను నియామిస్తూ గురువారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొర్ర గంగాధర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను నిస్వార్థంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, కిసాన్‌మోర్చ మాజీ జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అనిల్, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే



వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

## పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్4: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ రియాంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన నుంచి ఇప్పటి వరకు సరైన విధంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ రాక అనేక అవస్థలకు గురవుతున్నారని, చదువుకోవడానికి భారంగా ఉందని, కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించామని, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవాలని సూచించారు. విద్యావ్యతిరేక విధానాలు అవలంబిస్తే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏరియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## ఇంటి పన్నుపై 5శాతం తగ్గింపు

● మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 3: మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్నులు చెల్లింపుపై 5శాతం తగ్గింపు ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్‌గా ఇంటి పన్నులు చెల్లిస్తున్నా వారికి ఐదు శాతం తగ్గింపు ఉందని, ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

మాక్లూర్, ఏప్రిల్4: మండలంలోని బోర్గం(కె) గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధినిరోదక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు డాక్టర్ ఉమ మసాహెర్, డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 773 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు.



బోర్గం(కె)లో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

## విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

మాక్లూర్, ఏప్రిల్4: మండలంలోని బీరప్ప ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కుర్మ సోదరులు ఇలాంటి పండగలు జరుపుకోవడం ఆనందదాయకమని, ఎలాంటి సహాయ, సహకారాలు అవసరమున్నా తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, కుర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## క్షత్రీయ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలో ఎంపికైన ఇంజనీరింగ్ విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్4: ఆర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్యూస్పైడర్ హైదరాబాద్ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరం విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు యామిని, శ్రావ్య, ప్రియాంకకోలార్ నియామక ప్రక్రియ కొనసాగించారు. 133మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వీరికి అటిట్యూడ్ టెస్ట్, గ్రూప్ డిస్కర్షన్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. మూడ్ రౌండలలో ప్రతిభనుచూపిన 22మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ రాకేష్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## టీయూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పున్నయ్య

డిచ్‌పల్లి, ఏప్రిల్4: తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా.పున్నయ్య, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా డా.మోహన్‌బాబు, సహాయ కార్యదర్శులు డా.బాలకిషన్, డా.నీలిమా, కోశాధికారిగా డా.నాగరాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వివేక్, అశోక్‌వర్ధన్ తెలిపారు. గురువారం నిర్వహించిన ఎన్నికలలో పరిశీలకురాలిగా డా.కిరణ్మాయి వ్యవహరించారు. ప్రమాణస్వీకారం అనంతరం నూతన కార్యవర్గం రిజిస్ట్రార్ యాదగిరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఏర్గట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఏర్గట్ల, ఏప్రిల్4: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్‌తో కలిసి ప్రారంభించారు. ఏ గ్రేడు రూ.2203, బీ గ్రేడు రూ.2183 పొందాలని సంఘం సీఈవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో

# వైభవంగా సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

● పాల్గొన్న జగద్గురు శంకరచార్య విద్యారణ్యభారతి స్వామి

మాక్లూర్, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని హంపీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరచార్య విద్యారణ్య భారతిస్వామి చేతుల మీదుగా నిర్వహించారు. ఆలయ గోపురాన్ని అమర్చిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయంలో ఉదయం నుంచే భక్తుల సందడి నెలకొనగా వేదపండితుల మధ్య కుంకుమార్చనతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి శ్రీలక్ష్మణ సాహిత సీతా రామాంజనేయస్వామి ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేష్‌గుప్తా, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, సర్పంచ్ అశోక్‌రావు, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జైశ్రీరాం అంటూ నినాదాలు చేయగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు జోక్యం చేసుకొని ఆలయం వద్ద రాజకీయం చేయవద్దని వారిని అక్కడి నుంచి పంపించివేశారు. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలిరాగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటూ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామపెద్దలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మంత్రాలు ఉచ్చరిస్తున్న శంకరచార్య విద్యారణ్యభారతిస్వామి



గుడి గోపురాన్ని అమరుస్తున్న దృశ్యం

# వడదెబ్బపై ఉపాధి కూలీలకు అవగాహన

బీర్కూర్, ఏప్రిల్ 4: వేసవి కాలం నేపథ్యంలో రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్యశాఖ సిబ్బంది ఉపాధిహామీ కూలీలకు ప్రత్యేక అవగాహన కల్పించింది. గురువారం బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి పనుల వద్దకు ఆరోగ్యశాఖ సిబ్బంది చేరుకున్నారు. ఎండల బారి నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో కూలీలకు అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో రవీందర్ మాట్లాడుతూ ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలపై టోపి, గొడుగు, తెల్లటి వస్త్రాలు ధరించాలన్నారు. ఎండలో నుంచి ఇంటికి వచ్చాక నీరు, కొబ్బరి నీరు, నిమ్మరం, గ్లూకోజ్, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శారీరక శ్రమ పెంచే పనులు చేయకూడదని అన్నారు. తల తిరగడం, వాంతులు వంటి సమస్యలు వస్తే వడదెబ్బగా గుర్తించి వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధి కూలీలు ఉన్నారు.


రాజంపేటలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

### ఉపాధి హామీ పనుల పరిశీలన

**నసురుల్లాబాద్:** మండలంలోని మైలారం గ్రామంలో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను ఎంపీవో రాము పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనులకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఏ బలరాం, గ్రామ సెక్రెటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

### కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

**రాజంపేట:** ఉపాధి హామీ కూలీలకు గ్రామ పంచాయతీల నుంచి సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో రాజేశం తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలకు నీటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. మండలంలోని పెద్దాపల్లి, తలమడ్ల గ్రామాల్లో పనులను పరిశీలించి రోజురోజుకూ ఎండలు తీవ్రంగా ఉండడంతో ఉదయం 6 గంటల నుంచి 10గంటల వరకు ఉపాధి పనులు చేయాలని తెలిపారు. కూలీలకు రూ.300 చొప్పున అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏ భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## చలి వేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మద్నూర్, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో ప్రజల కోసం కాంగ్రెస్ నాయకుడు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జుక్కల్ శాసన సభ్యుడు లక్ష్మీకాంత్ రావు ప్రారంభించారు. మండల కేంద్రంలో తమ్మేవార్ వివాహ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని, ప్రజాసేవకు ముందుకు రావాలన్నారు. ఆయన వెంట నాయకులు సంగమేశ్వర్, సాయిలు, రమేష్ తదితరులున్నారు.


పల్లెప్రకృతి వనంలో చెట్లు నరికిన దృశ్యం

## పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేత

పిట్లం, ఏప్రిల్ 4:మండల కేంద్రంలో ముకుందరెడ్డి కాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేసారని కాలనీవాసులు తెలిపారు. గత ప్రభుత్వంలో పల్లెప్రకృతి వనంలో లక్షల రూపాయలతో గ్రామ పంచాయతీ స్థలంలో మొక్కలు నాటారు. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో పట్టించుకునే నాథుడు లేక ఇష్టారాజ్యంగా ఏపుగా పెరిగిన చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.


బీర్కూర్‌లో పంట నష్టం వాటిల్లిన పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ

## సైంటిస్టులు పరిశీలించాక చర్యలు తీసుకుంటాం

● ఏడీఏ వీరాస్వామి

బీర్కూర్, ఏప్రిల్ 4: నకిలీ విత్తనాలతో పంట నష్టం జరిగిందని రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం వ్యవసాయశాఖ ఏడీఏ వీరాస్వామి బీర్కూర్‌కు విచ్చేశారు. స్థానిక రైతులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి వరి పంటలను పరిశీలించారు. ఏడీఏ శాంపిళ్లను సేకరించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ బీర్కూర్‌కు చెందిన కొంత మంది రైతులు బీర్కూర్ గ్రోమోర్ షాపులో విత్తనాలు కొనుగోలు చేసి పంటలు సాగు చేశారని అన్నారు. అయితే పంట పొల్లు పోయిందని, పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు పంటలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు వచ్చి పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తారన్నారు. దాని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఏవో కమల, రైతులు ఉన్నారు.

## బస్వాపూర్ విండో చైర్మన్‌పై అవిశ్వాస సమావేశం

● కోర్టు స్టే తెచ్చుకున్న చైర్మన్

భిక్కనూరు, ఏప్రిల్ 4: భిక్కనూరు విండో చైర్మన్ కిష్టాగౌడ్‌పై విండో డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస సమావేశం గురువారం డీసీవో శ్రీనివాస్‌రావు విండో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విండో డైరెక్టర్లు 10 మంది ఉదయం నేరుగా క్యాంపు నుంచి విండో కార్యాలయానికి చేరుకుని అవిశ్వాస సమావేశానికి హాజరయ్యారు. ఈ మేరకు డీసీవో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గత నెల 12న విండో డైరెక్టర్లు విండో చైర్మన్ బూరుగు కిష్టాగౌడ్‌పై అవిశ్వాస తీర్మానం ఇవ్వడం జరిగిందని, దాని ప్రకారం విండో డైరెక్టర్లు అందరికీ ఏప్రిల్ 4న అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించడం జరుగుతుందని తాము నోటీసులు అందజేశామన్నారు. ఈ విషయంపై విండో చైర్మన్ హైకోర్టుకు వెళ్లగా తాము కౌంటర్ దాఖలు చేశామన్నారు. ఇరువురి వాదనలు విన్న జడ్జి అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని నోటీసులు అందించిన ప్రకారం నిర్వహించుకోవచ్చునని, తదుపరి విచారణ వరకు అవిశ్వాసానికి సంబంధించిన ఎలాంటి విషయాలను బహిర్గతం చేయవద్దని ఆదేశించినట్లు తెలిపారు. అందువల్ల అవిశ్వాసం నెగ్గిందా, వీగిపోయిందా అనే విషయాలను తెలుపలేమని, హైకోర్టు ఆదేశాల మేరకు తాము నిర్వహించిన అవిశ్వాస సమావేశానికి సంబంధించిన పూర్తి వివరాలను కోర్టుకు అందజేయనున్నట్లు తెలిపారు.

### మైనారిటీలకు కాంగ్రెస్ నేత ఇఫ్తార్ విందు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ జామా మసీదులో గురువారం మాల్తుమ్మెద సొసైటీ మాజీ అధ్యక్షుడు, మండల కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, బోయిని విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం


వైస్ ఎంపీపీకి వ్యతిరేకంగా చేతులు లేపిన బీఆర్ఎస్ ఎంపీటీసీలు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 4: నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీ దివిటి రాజ్‌దాస్‌పై మండల బీఆర్ఎస్ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. గురువారం నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అవిశ్వాస బలపరీక్ష సమావేశాన్ని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ ఏర్పాటు చేశారు. మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలకు గాను ధర్మారెడ్డి ఎంపీటీసీ కృష్ణవేణి మృతి చెందగా, మండలంలోని తొమ్మిది మంది ఎంపీటీసీలకు గాను ముగ్గురు ఎంపీటీసీలు సమావేశానికి గైర్హాజరు కాగా ఆరుగురు ఎంపీటీసీలు అవిశ్వాస సమావేశానికి హాజరైనట్లు వైస్ ఎంపీపీకి వ్యతిరేకంగా చేతులు లేపడంతో అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు మోతె శ్రీనివాస్, పుప్పాల నారాయణ, కంచనపల్లి మాధవి, టేకులపల్లి వినీత, గుర్రాల సుశీల, బేగరి విమలవ్వలు అవిశ్వాస సమావేశానికి హాజరు కాగా, వైస్ ఎంపీపీ రాజ్‌దాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓరా లావణ్య, రమావత్ సుజాతలు సమావేశానికి హాజరు కాలేదు. వైస్ ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేంద్రంలో టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

# ఆస్తి కోసం మామ హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిజాంసాగర్, ఏప్రిల్ 4: ఆస్తి కోసం స్వయానా మామను నిజాంసాగర్ కాల్వలో పారవేసిన సంఘటన మహ్మద్‌నగర్ మండలం బూర్గుల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన గుట్టమీది పోచయ్యకు మగ సంతానం లేకపోవడంతో కుమార్తె అయిన సుజాతకు బూర్గుల్ గ్రామానికి చెందిన గుట్టమీది శ్రీకాంత్‌ను ఇల్లరికం చేసుకున్నారు. కుటుంబంలో మామ, అల్లుడు, కూతురు జీవనం సాగిస్తున్నారు. పోచయ్య మేస్త్రి పని చేసేవాడు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్యను బుధవారం రాత్రి 10 గంటలకు అల్లుడు శ్రీకాంత్‌తో పాటు ఎస్‌కె మహబూబ్, నడిమింటి రాములు పోచయ్యను చంపి తన ద్విచక్ర వాహనంపై బూర్గుల్ శివారులో నిజాంసాగర్ ప్రధాన కాల్వపై ఉన్న రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఒరిగించి పోచయ్యను నిజాంసాగర్ ప్రధాన కాల్వలో తోసివేశారు. ఉదయాన్నే గ్రామం నుంచి మార్నింగ్ వాక్‌కు వెళ్లినవారు గమనించి గుట్టమీది పోచయ్యగా గుర్తించారు. కుమార్తెకు, అల్లునికి సమాచారం ఇవ్వగా, కుమార్తె మా నాన్న ఈ నెల 3వ తేదీన మధ్యాహ్నం నుంచి కనబడటం లేదని తెలిపింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఇన్‌చార్జి ఎస్సై నరేష్ మృతదేహాన్ని పరిశీలించి, బాన్సువాడ రూరల్ సీఐకి సమాచారం అందించారు. రూరల్ సీఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని బాన్సువాడ ఏరియాస్పత్రికి తరలించారు. పోచయ్యను హత మారిస్తే అతని పేరిట ఉన్న మూడెకరాల భూమి, ఇల్లు తనకే వస్తుందని పథకాన్ని రూపొందించుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో అల్లుడు, మామను హత్య చేస్తే ఎస్‌కె మహబూబ్, నడిమింటి రాములుకు లక్షా యాభై వేలు అందించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఇదే గ్రామానికి చెందిన చాకలి పెద్దదుర్గయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## తలమడ్లలో వాహనాల తనిఖీ

రాజంపేట, ఏప్రిల్ 4: మండలంలోని తలమడ్ల గ్రామ చౌరస్తాలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించినట్లు ఎస్ఐ సంపత్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలో సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వాహనాలను క్షుణంగా పరిశీలించి ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డబ్బు, మద్యం తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని వాహనదారులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

దోమకొండ, ఏప్రిల్ 4: మండలంలోని ముత్యంపేట సహకార సంఘం పరిధిలో చింతమాన్‌పల్లి, ముత్యంపేట గ్రామాల్లో గురువారం వరిధాన్యం కొనుగోలు సెంటర్లను ఏఈవో క్రిష్ణారెడ్డి, సీఈవో రాంచంద్రం ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. దళారులకు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

దోమకొండ, ఏప్రిల్ 4: మండలంలోని అంచనూర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో స్కూటీపై వెళ్తున్న బీబీపేట మండలం ఇస్సానగర్ గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి(55) మృతి చెందినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో తన ద్విచక్రవాహనానికి రిజిస్ట్రేషన్ చేసుకుని తిరిగి ఇస్సానగర్‌కు వస్తుండగా మార్గమాధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డుకు దిగువవైపున ఉన్న పొలంలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు భార్య ఇందిర ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## భూములకు తగ్గట్టు పంటలు సాగు చేయాలి

రామారెడ్డి, ఏప్రిల్ 4: పంటల సాగు చేస్తున్నప్పుడు రైతులు వ్యవసాయ భూములకు తగ్గట్టు పంటలను సాగు చేయాలని ఏవో హరీష్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పోసానిపేట్ గ్రామంలో చాకలి తిరుపతి అనే రైతు వరిపంటను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించారు. సమయానికి అనుగుణంగా ఎరువులు వేయాలని మంచి పంటలు సాగుచేస్తేనే అధిక లాభం ఉంటుందన్నారు. పంటలు సాగుముందు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకే పంటలు సాగు చేయాలని తెలిపారు. పంటలకు తగ్గట్టు ఎరువులు వేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రవి, రాజు, శ్రీనివాస్, రమేష్, రాజిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

తాడ్వాయి, ఏప్రిల్ 4: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొడి రవి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవికాలం వచ్చినందున భూగర్భజలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని ప్రతీ గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏ గ్రామంలోనైన తాగునీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై చర్చించారు.

# నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చూడాలి


మొక్కలను పరిశీలిస్తున్న ఏపీవో రజిని

బీబీపేట, ఏప్రిల్ 4: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలోని నర్సరీని, ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఏపీవో రజిని పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు ఉపాధి హామీ పనులు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేతనం గురించి వివరించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలతో పనులుచేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని ఆమె పరిశీలించి ఎండల బారి నుండి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గోపరాజయ్య, పంచాయతీకార్యదర్శి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

**తాడ్వాయి:** ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తాడ్వాయి ఎంపీడీవో సాజిద్‌అలీ తెలిపారు. మండలంలోని కృష్ణాజీవాడి, బ్రహ్మజీవాడి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో గురువారం పల్లె ప్రకృతి వనాలను, నర్సరీలను పరిశీలించారు. ప్రతీ నర్సరీలో మొక్కలు ఎండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం డంప్ యార్డులను పరిశీలించారు. డంప్‌యార్డులలో చెత్తచెదారం వేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.


ప్రమాదకరంగా రోడ్డుపై ఉన్న గుంత

## ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 4 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో ప్రధాన రహదారిపై నీటి పారుదల శాఖ కాలువపై రోడ్డు కూలి ప్రమాదాలకు నిలయంగా మారింది. అక్కడి రహదారిపై నిత్యం లింగారెడ్డిపేట్, కళ్యాణి రత్నాపూర్, తిమ్మారెడ్డి గ్రామాలకు చెందిన గ్రామ ప్రజలు వాహనాలపై ఎల్లారెడ్డికి నిత్యం వస్తుంటారు. గుంత ప్రమాదకరంగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు, నాయకులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ నాయకులు

## బీబీ పాటిల్ అభివృద్ధి చేసిందేమి లేదు

● నాగిరెడ్డిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 4: జహీరాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ నుంచి రెండుసార్లు గెలుపొందిన బీబీ పాటిల్ ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏ మాత్రం కృషి చేయలేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఆరోపించారు. ఆయన గురువారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మండల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచి పదేళ్లు అధికారంలో ఉండి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పర్యటించలేదని, ప్రజల సమస్యలను ఏ మాత్రం తెలుసుకోలేదని ఆయన పరిశీలించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో పూర్తిగా బలహీన పడటంతో ఆయన బీజేపీలో చేరి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారన్నారు. రెండుసార్లు ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే ఏ మాత్రం ప్రజలకు అందుబాటులో ఉండని బీబీ పాటిల్‌కు ఈసారి ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.



## గంప గోవర్ధన్ సూచన మేరకే తాము క్యాంప్‌కు వెళ్లాం

● డీసీసీబీ డైరెక్టర్ కిష్టాగౌడ్

భిక్కనూరు, ఏప్రిల్ 4: కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌తో చాలా సమయం చర్చించాక అతడి సూచన మేరకే తాను, జంగంపల్లి విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ సిద్ధ రాములు గోవా క్యాంపునకు వెళ్లామని బస్వాపూర్ విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కిష్టాగౌడ్ అన్నారు. గురువారం భిక్కనూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నమ్మించి మోసం చేయడంలో గంప గోవర్ధన్ దిట్ట అని, తమను క్యాంపునకు వెళ్లమని అతడే చెప్పి అనంతరం ఏమీ తెలియనట్టుగా బస్వాపూర్ విండో డైరెక్టర్లను బెదిరించి వారితో తనపై అవిశ్వాస తీర్మానం పెట్టించాడని ఆరోపించారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు గంప గోవర్ధన్ కోసం చాలా చేశానని, నా జీవితాన్ని అతడి కోసం ధారపోశానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం సీఎం కేసీఆర్ కామారెడ్డిలో పోటీచేస్తే కేసీఆర్‌ను ఎలాగైనా ఓడించాలని తమతో చెప్పాడని, కేసీఆర్‌ను ఓడించాలనే ఆ ఎన్నికల్లో ఆయన ఎక్కువగా ప్రచారం చేయలేదని, ఈ విషయాలతో పాటుగా కేసీఆర్, కేటీఆర్‌ను కలిసి గంప గోవర్ధన్‌కు సంబంధించిన అన్ని విషయాలను తెలియజేస్తానని అన్నారు. నాలాగే కామారెడ్డి నియోజకవర్గంలో చాలా మందిని నమ్మించి గంప గోవర్ధన్ మోసం చేశాడని, అతడి వల్ల మోసపోయిన వారిని కలుపుకుని గ్రామగ్రామాన గోవర్ధన్ నిజస్వరూపాన్ని బయట పెడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సిద్దాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇంటిలో అగ్ని ప్రమాదం

బీర్కూర్, ఏప్రిల్ 4: మండలంలోని బరంగేడ్గి గ్రామంలో గల సాకలి నాగయ్యకు చెందిన డబుల్ బెడ్‌రూం ఇంట్లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో లక్ష రూపాయల నగదుతో పాటు మరో లక్ష రూపాయల వస్తువులు కాలి బూడిదయ్యాయని బాధితుడు తెలిపారు.



## సినిమా గైడ్ కామారెడ్డి



| కామారెడ్డి | |
|---|---|
| దర్శన్ | ప్రాజెక్ట్(జడ్) |
| శాంతి | టిల్ స్క్వేర్ |
| ప్రియా 70 | ది ఫ్యామిలీ స్టార్ |

| బాన్సువాడ | |
|---|---|
| మహేశ్వరి | టిల్లు స్క్వేర్ |
| వెంకటేశ్వర | గోట్‌లైఫ్ |

## చికెన్ ధరలు



| రకం | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | 100 | 160 | 180 |
| వెన్‌కాబ్(కిలో) | 100 | 180 | 210 |

